ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 7 అక్టోబరు 2024



మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు: ఎస్పీ

విజయనగరం క్రైం, అక్టోబరు 6: మద్యం సేవించి వాహనం నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజా శాంతికి భంగం కలిగించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. విజిబుల్ పోలీసింగుతో పాటు రహదారి ప్రమాదాల నియంత్రణపైనా దృష్టిపెట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారికి కౌన్సిలింగు నిర్వహించి, తమపై ఆధారపడి జీవించే భార్య, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని, ద్విచక్రవాహనం నడిపే సందర్భంలో హెల్మెట్ ధరించాలని చెప్పాలన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులు, భక్తుల రాకపోకలు నడుమ కోలాహలంగా గుడి ఆవరణం

పండగ శోభ

- సిరిమానోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు
- సంప్రదాయబద్ధంగా చాటింపు పూర్తి
- ఆ రోజు 3 గంటలకే సిరిమాను ఊరేగింపు ప్రారంభం
- ప్రణాళికతో అడుగులు వేస్తున్న అధికారులు

(విజయనగరం రూరల్)

నడిచే దేవతగా పేరొందిన పైడిమాంబ సిరిమానోత్సవానికి సమయం సమీపిస్తోంది. ఆలయ అధికారులు, జిల్లా యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కలెక్టర్ అంబేడ్కర్ రెండు దఫాలుగా సమావేశాలు నిర్వహించి పండగ నిర్వహణపై దిశను నిర్దేశించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా సమీక్షించారు. సిరిమానోత్సవ ఘట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 3 గంటలకే ప్రారంభించి.. 5 నుంచి 5.30 గంటల మధ్య పూర్తి చేయాలనుకుంటున్నారు. పైడిమాంబ పరివారంగా భావించే అంజలిరథం, బెత్సవారి వల, పాలధార, ఇతర రథాలను కూడా వేగంగా కదిలించాలని నిర్ణయించారు. పోలీసులకు ఆ బాధ్యతలు అప్పగించారు. ప్రధాన సిరిమాను రథం హుకుంపేట నుంచి వేగంగా చదురుగుడికి చేర్చగలిగితే నిర్దేశించిన సమయం లోగానే సిరిమాను ఊరేగింపు ప్రారంభం అవుతుంది. సిరిమానుకు పూజలు నిర్వహించి పురోహితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమాను పీఠం అధిరోహిస్తారు. దీనికి కనీసం గంట సమయం పైగా పడుతుంది. అంటే హుకుంపేట నుంచి సిరిమాను రథం చదురుగుడికి ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1 గంట మధ్య చేరుకోగలిగితే అధికారులు నిర్దేశించిన సమయం ప్రకారం 3 గంటలకు ప్రారంభమౌతుంది. ఇదే విషయమై ఈనెల 5న విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి ఆధ్వర్యంలో కార్యాలయంలో సమావేశం జరిగింది. సిరిమాను, ఇతర రథాల నిర్వాహకులకు సమయం, ఆయా రథాల వెనుక వచ్చే వారి సంఖ్య కూడా వీలైనంత తక్కువగా ఉండాలని సూచించారు.

ఏర్పాట్లు వేగవంతం చేయండి..

పైడిమాంబ సిరిమానోత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయాలని దేవదాయశాఖ రాష్ట్ర అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ చెప్పారు. ఆదివారం ఆయన చదురుగుడికి వచ్చారు. సిరిమానోత్సవ ఏర్పాట్లపై దేవదాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ క్యూలైన్లు, చలువ పందిళ్లు, షామియానాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో వెంటనే ఏర్పాటు చేయకపోతే లక్షలాది మంది భక్తులకు ఏ విధంగా సౌకర్యాలు కల్పిస్తారని అధికారులను ప్రశ్నించారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఉత్సవ ప్రత్యేకాధికారి త్రినాథరావు, ఆలయ ఈవో డివి ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సిరిమానోత్సవానికి చాటింపు వేస్తున్న దృశ్యం

పండగకు రారండహో..

- పైడిమాంబ సిరిమానోత్సవం చాటింపు

విజయనగరం రూరల్, అక్టోబరు 6: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదేవత పైడిమాంబ సిరిమానోత్సవ చాటింపు ప్రక్రియ ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు చదురుగుడి వద్ద సంప్రదాయబద్ధంగా జరిగింది. ఏటా సిరిమానోత్సవానికి ముందు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజు ఆధ్వర్యంలో డప్పు కళాకారులు సిరిమానోత్సవ చాటింపు నిర్వహించారు. తొలుత చదురుగుడిలో, అనంతరం చదురుగుడి బయట, ఆ తరువాత డప్పులు వాయిస్తూ కోట వరకూ వెళ్లి చాటింపు ప్రక్రియను కొనసాగించారు. ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్య దూరం కాకూడదు

- ఉపాధ్యాయ సంఘాలు కీలకంగా ఉండాలి
- అఖిల భారత విద్యా హక్కుల వేదిక చైర్మన్ జగ్‌మోహన్ సింగ్
- అట్టహాసంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- వేలాదిగా తరలివచ్చిన ప్రతినిధులు

నెల్లిమర్ల, అక్టోబరు 6: పేదలకు ఉచిత విద్య దూరం అయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయని, వీటిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని అఖిల భారత విద్యా హక్కుల వేదిక చైర్మన్ జగ్‌మోహన్‌సింగ్ పిలుపునిచ్చారు. పేదలకు విద్యను దూరం కాకుండా చూసుకోవడంలో ఉపాధ్యాయ సంఘాలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఏపీటీఎఫ్ (1938) 80 వసంతాల వేడుకలు, 20వ విద్యావైజ్ఞానిక రాష్ట్ర స్థాయి మహాసభలు విజయనగరం సమీప జె కన్వెన్షన్ హాలు ఆవరణలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ మహాసభలను జగ్‌మోహన్ సింగ్ ప్రారంభించారు. అంతకుముందు జాతీయ పతాకాన్ని విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ఎగుర వేయగా ఏఐఎఫ్ఈఏ పతాకాన్ని ఆ సంఘం అధ్యక్షుడు సుధీర్ కుమార్, ఏపీటీఎఫ్ పతాకాన్ని ఉపాధ్యాయ ప్రగతి పత్రిక సంపాదకుడు జి.సత్యనారాయణ ఎగురవేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అధ్యక్షతన జరిగిన సభలో జగ్‌మోహన్‌సింగ్ మాట్లాడుతూ విద్యారంగం నానాటికి ప్రైవేటు రంగంలోకి జారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ప్రైవేటీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 80 ఏళ్ల కాలంగా ఏపీటీఎఫ్ ఉద్యమ పథంలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మానవాభివృద్ధి సూచీలో భారత్ వెనకబడి ఉందని, దాన్ని ముందుకు తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ పేదలకు విద్యావకాశాలు కల్పించేందుకే తన తాత దివంగత పీవీజీ రాజు మాన్సాస్ సంస్థలను నెలకొల్పారని వివరించారు. తాను కూడా కొంత కాలం మాంటిస్సోరి పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేశానని ఆమె గుర్తు చేశా రు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులునాయుడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఏఐఎఫ్ఈఏ జాతీయ ఉపాధ్యక్షుడు వై.సత్యం, ప్రొఫెసర్ జి.హరగోపాల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు వి.నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బలరామ్‌నాయుడు, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌టీ నాయుడు తదితరులు పాల్గొని ప్రసంగించారు. చీపురుపల్లి, రాజాం జవహర్ బాలభవన్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందర్నీ అలరించాయి. మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3వేల మంది ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న జగ్‌మోహన్‌సింగ్

మద్యం షాపులు చేజెక్కించుకోవాలని..

- పెరుగుతున్న దరఖాస్తులు

విజయనగరం క్రైం, అక్టోబరు 6: నూతన మద్యం పాలసీ విధానంలో జిల్లాలో కొత్తగా ప్రకటించిన 153 మద్యం షాపులకు రోజురోజుకూ దరఖాస్తులు పెరుగుతున్నాయి. లాటరీ విధానంలో ఎవరికి ఏ షాపు దక్కుతుందో ఈనెల 11న తేలనుంది. ఏ ప్రాంతంలో దుకాణం కావాలనుకుంటున్నారో ఆ ప్రాంతానికి వెళ్లకుండా సమీపంలోని ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వవచ్చు. ఆన్‌లైన్ విధానం కూడా అందుబాటులో ఉంది. ఈ నెల 5 వరకూ విజయనగరం టౌన్ పరిధిలో 28 దరఖాస్తులు వచ్చాయి. రూరల్ పరిధిలో 25, భోగాపురం సర్కిల్‌లో 25, చీపురుపల్లి సర్కిల్‌లో 4, గజపతినగరం పరిధిలో 16, ఎస్.కోటలో 34, బొబ్బిలిలో 6, రాజాంలో 45 ఇలా దరఖాస్తు ప్రారంభమైన నాటి నుంచి ఆదివారం వరకూ 153 షాపులకు గాను 855 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాధుడు తెలిపారు. ఒక్కో దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు కావడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం రానుంది.



జిల్లాలో ఇసుక కొరత లేదు

- ఆరు నెలల అవసరాలకు సరిపడా సిద్ధం
- ప్రైవేటు భూముల్లో ఇసుక మేటలకు అనుమతి
- జేసీ సేతుమాధవన్

కలెక్టరేట్, అక్టోబరు 6: జిల్లాలో ఇసుక కొరత లేదని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తేల్చిచెప్పారు. వచ్చే ఆరు నెలల వరకూ జిల్లా అవసరాలకు సరిపడా ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. అక్రమంగా ఇసుక తవ్వకాలను నిర్వహించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చ రించారు. నూతన ఇసుక పాలసీ, ప్రస్తుత ఇసుక లభ్యత, సరఫరాపై స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం బొబ్బిలిలో సుమారు 300 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, కావాల్సిన వారికి సరఫరా చేస్తున్నామని చెప్పారు. రవాణా, హేండ్లింగ్ చార్జీల కింద మెట్రిక్ టన్నుకు రూ.577 చొప్పున వినియోగదారులు చెల్లించాల్సి ఉందన్నారు. వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద 70 వేల టన్నుల ఇసుక లభిస్తుందని చెప్పారు. అక్కడ నుంచి బొబ్బిలి స్టాక్‌పాయింట్‌కు ఇసుక తరలించి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. చీపురుపల్లిలో కూడా త్వరలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి ఇసుక సరఫరా చేస్తామన్నారు. తెర్లాం, సంతకవిటి మండలాల్లో కొత్తగా రెండు ఇసుక రీచ్‌లను గుర్తించామని, ఈనెల 15న తేదీ నుంచి తవ్వకాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈనెల 16 నుంచి ఇసుక పూర్తిగా అందుబాటులో ఉంటుందన్నారు. నెలకు సుమారు 30 వేల మెట్రిక్ టన్నులు చొప్పున రానున్న ఆరు నెలలకు జిల్లాకు సుమారు లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని అంచనా వేశామని, దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని చెప్పారు.



శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ఇసుక

ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా కేటాయిస్తామని జేసీ సేతుమాధవన్ తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఇసుక్ బుక్ చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు సొంతంగా వాహనం తెచ్చుకుంటే దానిలో ఇసుక నింపి తీసుకుని వెళ్ళవచ్చునని తెలిపారు. అలాగే ఆర్‌టీవో వద్ద నమోదు చేసుకున్న 175 వాహనాలు జీపీఎస్ విధానంతో అనుసంధానమై ఉన్నాయని, వీటి ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీలను చెల్లించి ఇసుక తీసుకుని వెళ్లవచ్చని సూచించారు. ఇసుక తవ్వకాలు, సరఫరా, రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో డెంకాడ స్టాక్ పాయింట్‌లో కూడా త్వరలో ఇసుక అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు

జిల్లాలోని ఎక్కడైనా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. వారికి భారీగా జరిమానా విధించడంతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

రేషన్ బియ్యం పక్కదారి

- భారీగా పట్టుబడుతున్న నిల్వలు
- కొందరు మిల్లర్లే సూత్రధారులు
- చిరు వ్యాపారుల ద్వారా కొనుగోళ్లు



- ఆగస్టు 10న చీపురుపల్లి మండలం మెట్టపల్లిలో 650 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు ఇద్దరు వ్యక్తుల ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని పట్టుకున్నారు. నిందితులపై 6ఏ కేసు నమోదుచేశారు.

- ఈ నెల 4న చీపురుపల్లి పోలీసులు 2,800 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాయి. మెట్టపల్లి గ్రామం నుంచి తరలిస్తున్నట్టు తేలింది. వాహన డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేశారు.

రాజాం, అక్టోబరు 6: జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ప్రతిరోజూ అధికారుల తనిఖీల్లో ఏదో చోట బియ్యం పట్టుబడుతూనే ఉంది. అక్రమార్కులు బరితెగించి వ్యవహరిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో కొందరు మిల్లర్లే క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. తమ చేతికి మట్టి అంటకుండా తతంగం నడిపిస్తున్నట్టు సమాచారం. గ్రామస్థాయిలో చిరు వ్యాపారులను భాగస్వామ్యం చేసుకొని రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా నడిపిస్తున్నారు.

రేషన్ వచ్చిన వెంటనే..

కొవిడ్ సమయం నుంచి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికీ ఆ పథకం కొనసాగుతునే ఉంది. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం రూపాయికి కిలో బియ్యాన్ని అందిస్తోంది. ఈ బియ్యాన్ని రైతు కుటుంబాలతో పాటు ఎగువ మధ్యతరగతి వారు ఎక్కువగా విక్రయిస్తున్నారు. గతంలో నేరుగా లబ్ధిదారుల నుంచి డీలర్లే కొనుగోలు చేసేవారు. ఇప్పుడు చిరు వ్యాపారులు రంగంలోకి దిగుతున్నారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ కిలో బియ్యాన్ని రూ.15 నుంచి రూ.20 వరకూ కొనుగోలు చేస్తున్నారు. వాటినే మిల్లర్లకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే మిల్లర్లు ఇచ్చిన సొమ్ముతోనే ఇక్కడ చిరువ్యాపారులు బియ్యం కొనుగోలు చేస్తున్నారని తెలిసింది. కిలో దగ్గర రూ.5 నుంచి రూ.10 వరకూ కమీషన్ తీసుకుంటున్నారు. ఇదే బియ్యాన్ని మిల్లర్లు లెవీకి చూపించి సొమ్ము చేసుకుంటున్నారు.

మర పెట్టకుండానే..

సాధారణంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేస్తుంది. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తుంది. వారు ఏడాది పొడవునా మిల్లింగ్ చేసి పౌరసరఫరాల శాఖకు అప్పగించాలి. ఇందుకుగాను క్వింటా మిల్లింగ్ చేసేందుకు ప్రభుత్వం రూ.60 చెల్లిస్తుంది. అయితే ఇక్కడే కొందరు మిల్లర్లు దగా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని నేరుగా లెవీగా చూపుతున్నారు. చిరు వ్యాపారుల ద్వారా కొనుగోలు చేయించిన బియ్యాన్నే మిల్లింగ్ చేసిన బియ్యంగా చూపుతున్నారు. రూ.25 నుంచి రూ.30 వరకూ రేషన్ బియ్యాన్ని చూపి లెవీకి పంపుతున్నారు. బస్తా దగ్గర రూ.30 వరకూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

సన్న బియ్యంగా మార్చి..

రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్నబియ్యంగా కొందరు మిల్లర్లు చూపుతున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసే రేషన్ బియ్యాన్ని సాంబమసూరి వంటి బ్రాండెడ్ బియ్యంలో కలిపి విక్రయిస్తున్నారు. సన్నంగా మరపట్టడంతో వినియోగదారులు సైతం గుర్తించలేక మోసపోతున్నారు. అటు తూకం దగ్గర సైతం ఇదే పరిస్థితి. 25 కిలోలు ఉండే ప్యాకెట్ లో ఉండేది 23 కిలోలే. రెండు కిలోలు తరుగును చూపిస్తున్నారు. ఇటు బియ్యం నకిలీతో పాటు తూకంలో సైతం వినియోగదారుడు నష్టపోవాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు కానీ.. తూనికలు కొలతలు శాఖ అధికారులు కానీ పకడ్బందీ చర్యలు చేపట్టడం లేదు.

వంతెన నిర్మించారు.. రోడ్డు మరిచారు

● వావిలవలస, అంబఖండి గ్రామస్థులకు అవస్థలు

● ఇదీ మద్దువలస ప్రధాన కాలువపై పరిస్థితి



వావిలవలస- అంబఖండి వంతెన వద్ద రోడ్డు నిర్మించని దృశ్యం

రేగిడి: మండలంలోని వావిలవలస- అంబఖండి గ్రామాల మధ్య రాకపోకలకోసం దశాబ్ద కాలం కిందట మద్దువలస ప్రధాన కాలువపై వంతెన నిర్మించారు. అయితే రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో రెండు గ్రామాలతో పాటు ఈ మార్గంలో వెళ్లే పలు గ్రామాల వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ వంతెన నిర్మించడంతో రెండు గ్రామాల ప్రజలు ఎంతగానో సంతోషించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా పక్కా రోడ్డు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు వైపులా బురదమయంకావడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. ప్రధానంగా ఈ వంతెన గుండా ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకల వల్ల మూడు కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. ప్రస్తుతం పక్కా రోడ్డు లేకపోవడంతో వావిలవలస, అంబఖండి చేరుకోవడానికి మూడుగ్రామాలు దాటాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా కావడంతోపాటు అత్యవసర సమయాల్లో ఇబ్బంది పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా కిలోమీటరు చొప్పున పక్కా రోడ్డు నిర్మిస్తే రెండు గ్రామాల ప్రజల రవాణా సమస్య గట్టెక్కుతుంది. పంటల సమయంలో రైతులు తమ ఉత్పత్తులు ఇళ్లకు తీసుకువెళ్లడానికి ఈ మార్గం కీలకంగా మారింది. అయితే రెండు వైపులా సరైన రోడ్డు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

విస్తరించరు.. ఆక్రమణలు తొలగించరు

● తరచూ వాహన ప్రమాదాలు ● ఇదీ ముసిరాం-సంతపేట రోడ్డు పరిస్థితి

లక్కవరపుకోట: మండలంలోని ముసిరాం-సంతపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతోపాటు ఆక్రమణలు తొలగించకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. వేపాడ, ఎల్‌.కోట మండలాల నుంచి విశాఖ జిల్లాలోని కోటపాడు, దేవరాపల్లి మండలాలకు ఈ మార్గంలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. దీనికితోడు గోల్డ్‌స్టార్, మహామాయ కంపెనీలకు సంబంధించిన లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. వెడల్పు తక్కువగా ఉండడంతో రోడ్డుపై రెండు వాహనాలు వచ్చే సమయంలో తప్పించుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిసార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు ముసిరాం, కల్లేపల్లి, రేగ, లచ్చింపేట, భూమిరెడ్డిపాలెం, చందులూరు, మార్లాపల్లి,సంతపేటకూడలి వద్ద రోడ్డు ఆక్ర మణలకు తోడు పిచ్చిమొక్కలు,తుప్పలు పెరగడం వల్ల వాహన చోదకులు అగచాట్లకు గురవుతున్నారు. సుమారు 13 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వారు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ నుంచి విముక్తి చేయాలని కోరుతున్నారు.



ఇరుగ్గా ఉన్న ముసిరాం-సంతపేట రోడ్డు



బొబ్బిలి - సాలూరు రైల్ బస్సు

రైలు బస్సు కోసం ఎదురుచూపు

● బొబ్బిలి, సాలూరు ప్రయాణికులకు అవస్థలు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి-సాలూరు మధ్య సుదీర్ఘకాలంగా సేవలందించిన రైలు బస్సుకోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. గతంలో ప్రతిరోజూ మూడు ట్రిప్పులు నడిచేది. 80 మంది సీట్ల సామర్థ్యంతో ఒక బోగి ఏర్పాటుచేసిన విషయం విదితమే. సుమారుగా రోజుకు 500 మందిని గమ్యస్థానాలకు చేర్చేది. రైలు బస్సు వల్ల గిరిజనులు, విద్యార్థులు, కార్మికులు సకాలంలో గమ్యస్థానాలను చేరుకునే వారు. అయితే ఈస్టుకోస్టు జోన్ పరిధిలో గల రాయగడ డివిజన్ అధికారులు రైలు బస్సు సేవలు కరోనా సమయంలో నిలిపివేశారు. దీంతో సాలూరు- బొబ్బిలి మధ్య సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా కొండకోనల్లో గిరిజనులు సేకరించే ఉత్పత్తులు మార్కెట్‌కు తరలించేందుకు అనువుగా ఉండేది. ఈ బస్సు నిలిపివేయడంతో ప్రైవేటు వాహనాలకు అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. ప్రధానంగా ఈ మార్గంలో ఊహించినంత ఆదాయం రాకపోవడంతో బస్సు సేవలను నిలిపివేసినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా సాలూరు ప్రజల చిరకాలవాంఛ రైలు సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. ఈమేరకు ఎట్టకేలకు శుక్రవారం ట్రైల్ రన్ పూర్తిచేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో రైలుబస్సు సేవలపై కూడా ఇక్కడ ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. తక్షణమే రైల్వే అధికారులు బస్సును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

● వైద్యులు అందుబాటులో లేకే తండ్రి మృతిచెందారని ఆరోపణ



ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న నూకరాజు కుటుంబ సభ్యులు

గజపతినగరం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే తమ తండ్రి మృతి చెందారని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన రాపర్తి నూకరాజు కుటుంబసభ్యులు ఆదివారం ఆసుపత్రిఎదుట ఆందోళనకు దిగారు. తుమ్మికాపల్లికి చెందిన రాపర్తి నూకరాజుకు ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండడంతో గజపతినగరం ఏరియా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. అక్కడ వైద్య పరీక్షల నిమిత్తం ఇంజక్షన్ చేసిన తర్వాత నూకరాజు గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇక్కడకు వచ్చిన అరగంటవరకు వైద్యులు రాకపోవడంతో సకాలంలో వైద్యం అందక నూకరాజు చనిపోయాడని కుమార్తె హేమ ఆరోపించింది. కుటుంబసభ్యులు ఆందోళన చేస్తుండడంతో ఎస్ఐ కె.లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. వైద్యులు నూకరాజు వచ్చిన తక్షణమే సేవలు అందజేశారని, అయితే గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు తెలియజేశారని ఎస్ఐ చెప్పారు. అనంతరం నూకరాజు కుటుంబ సభ్యులకు సర్దిచెప్పడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

పడాల అరుణకు పరామర్శ

గజపతినగరం: గజపతినగరంలో జనసేన పార్టీ పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు పడాల శరత్‌చంద్ర ఇటీవల మృతి చెందడంతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఆమె, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, నాయకులు పీవీవీ గోపాలరాజు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

చురుగ్గా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు



కొర్లాం వద్ద పూర్తికావస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే

గంట్యాడ: జిల్లాలో విశాఖ-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తవలస నుంచి మెంటాడ వరకూ సుమారు 40 కిలోమీటర్ల పనులు చేపడుతున్నారు.రోడ్డు పనులు కొంత వరకు పూర్తయినా, మొక్కలు నాటడం తదితర చిన్న చిన్న పనులు చేయాల్సిఉంది. కొర్లాం వద్ద ఇంటర్ చెంజ్ పనులు సాగుతున్నాయి. ఈ హైవే నిర్మాణం వల్ల విజయనగరం, ఎస్.కోట నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయరహదారిపై వెళ్లడానికి అవకాశంలేదు. ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తూ ఏర్పాటుచేసిన రహదారి గుండా వెళ్లాలి.అలాగే రామవరం నుంచి చిలకలగెడ్డ వరకూ రోడ్డు కూడా విస్తరించారు.విశాఖ నుంచి రాయపూర్ వరకూ ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్రరోడ్డు రవాణాశాఖ నిధులు మంజూరుచేసిన విషయం విదితమే. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం తర్వాత ఈ ప్రాంతం రూపురేకలు పూర్తిగా మారిపోయాయి. చుట్టు రహదారి మధ్యలో పచ్చని పొలాలుతో దర్శనమిస్తున్నాయి.

పిట్టాడ నుంచి ఆండ్ర వరకు జంగిల్ క్లియరెన్స్



తుప్పలు తొలగింపును పరిశీలిస్తున్న ఎస్ఐ సీతారాం

మెంటాడ: పిట్టాడ నుంచి ఆండ్ర వరకు ఆర్‌అండ్‌బీ రహదారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా ఆదివారం జంగిల్‌క్లియరెన్స్ చేశారు.ఎస్ఐ కె.సీతారాం ఆధ్వర్యంలో తుప్పలు, డొంకలు తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరగడంతో మలుపులు ఉన్న ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించక పోవడంతో వాహనాలు ఢీకొని పలువురు గాయపడుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈమార్గంలో ద్విచక్రవాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించారు.

ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలి

నెల్లిమర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవరుచుకోవాలని సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి తెలిపారు. ఆదివారం మండలంలోని ఒమ్మిలో పసుపుకొమ్ములతో ఏర్పాటుచేసిన దుర్గాదేవి ప్రతిమను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో రామతీర్థం దేవస్థానం అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు

● వివిధ రూపాల్లో అమ్మవారి అలంకరణ



బొండపల్లి: దేవుపల్లిలో రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీనివాస్



శృంగవరపుకోట: దారగంగమ్మ ఆలయంలో ఏర్పాటుచేసిన నవదుర్గాలు



బొబ్బిలి: దాడితల్లి అమ్మవారి ఆలయానికి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



రాజాం: దోలపేట కనకదుర్గమ్మ ఆలయంలో లలితా సహస్ర పారాయణం నిర్వహిస్తున్న భక్తులు



విజయనగరం దాసన్నపేట: విజయ కనకదుర్గమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న నిర్వాహకులు

జిల్లాలో శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారిని వేర్వేరు రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో మహిళలు లలితా పారాయణం, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయాల ఆవరణలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



చీపురుపల్లి: అన్నపూర్ణ దేవీగా కనకమహాలక్ష్మి అమ్మవారు



రామభద్రపురం: రామ లింగేశ్వరాలయంలో..



సంతకవిటి: మోదుగులపేటలో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

కోలాటం పోటీ విజేతగా నారాయప్పవలస



కోలాటం పోటీల విజేతలతో నిర్వాహకులు

బొబ్బిలి: బొబ్బిలి కళాభారతి ఆడిటోరియంలో మల్టీ టాలెంట్ గ్రూపు ప్రతినిధులు పి.చిన్నికృష్ణ, జి.కరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీల్లో నారాయప్పవలస లక్ష్మీనరసింహ జట్టు విజేతగా నిలిచింది. మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 21 జట్లు పాల్గొనగా, పొందూరుకు చెందిన దుర్గాదేవి,అరసాడ జడ్పీహెచ్ జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పార్వతీపురం జానకీ రమణ, నిడగల్లు శ్రీసిద్ధివినాయక, తోణాం శ్రీబంగారమ్మతల్లి కోలాటం జట్లు నాలుగు, ఐదు, ఆరు స్థానాలు సాధించాయి. విజేతలకు డీఎస్పీ పి.శ్రీనివాసరావు బహుమతులను పంపిణీచేశారు. న్యాయ నిర్ణేతలుగా మీసాల చినగౌరినాయుడు, తాడుతూరివెంకటరమణ, చింతా రమణ, జి.సిమ్మనాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో జనసేననేత పాలూరు బాబు,కళాభారతి ప్రతినిధి నంబియార్ వేణుగోపాలరావు, ఆనందోబ్రహ్మ అధ్యక్షుడు మిండి విజయమోహనరావు, జేసీరాజు, ఎస్‌పీ రమణమూర్తి, కె.కృష్ణదాసు, నాగరాజు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి: కొండపల్లి

బొండపల్లి: ఆలయాల అభివృద్ధికి కృషిచేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం దేవుపల్లిలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మానికి కట్టుబడి టీడీపీ అన్ని ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, టీడీపీ మండలాధ్యక్షుడు కోరాడ కృష్ణ, సర్పంచ్‌లు నంబూరి రాజేష్, నడుపూరి భాస్కరనాయుడు, ఉపసర్పంచ్ రాపాక అచ్చంనాయుడు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ రేస్‌తో శారీరక దృఢత్వం



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

విజయనగరం టౌన్: క్రాస్ కంట్రీ రేస్‌తో విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి తెలిపారు. ఆదివారంకోరుకొండ సైనిక పాఠశాలలో విద్యార్థులకు ఇంటర్ హౌస్ క్రాస్ కంట్రీ రేస్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రాస్ కంట్రీ రేస్‌తో విద్యార్థుల్లో ఐకమత్యం పెంపొందుతుందన్నారు.అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

తూటికాడ కషాయం తయారీపై అవగాహన



తూటికాడ కషాయాన్ని తయారు చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు ఆధ్వర్యంలో రైతులకు తూటికాడ కషాయం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం, ఐసీఆర్ పీ శ్రీరామనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు



చిరంజీవిరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట: ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు.ఆదివారం విజయనగరం కోట జంక్షన్ సమీపంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు చిరంజీవిరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు బంకురుజోగినాయుడు, కర్రి రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలి

విజయనగరం రూరల్: మునిసిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు తక్షణమే చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు, ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జోగారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ బోధనకు ఆటంకం కలిగే, విద్యారంగానికి సంబంధించిన యాప్‌లను రద్దుచేయాలని కోరారు. జీవో-115ని రద్దుచేయాలని, 30 శాతం ఐఆర్ డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ ప్రతినిధులు శ్యామ్, గోవిందరావు, మురళీ, రవి, రాంబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు



బేబీనాయనకు విరాళాలు అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: విజయవాడ ప్రాంతంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు పలువురు ముందుకొచ్చారు.ఈ మేరకు నందబలగ గ్రామ టీడీపీ నాయకులు పెదిరెడ్ల కాశినాయుడు, అక్కేన నూకంనాయుడు, వంజుల ఆనందరావు, మూకి అనంత్, చుక్కల పోలినాయుడు, గంట అప్పలనాయుడు కలిసి రూ. 30,000, తెర్లాం మండలంలోని రామన్నవలస టీడీపీ నాయకులు ఎం.సంగం నాయుడు, తీల సత్యనారాయణ, కోట సురేష్ , గ్రామస్థులు కలిసి రూ. 10,500, కొల్లివలస టీడీపీ నాయకులు, గ్రామస్థులు రూ. 6,000 వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బేబీనాయనకు అందజేశారు.

రామభద్రపురంలో వైద్య శిబిరం

రామభద్రపురం: రామభద్రపురంలోని చొక్కాపువీధి రామ మందిరం వద్ద ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. క్యూస్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి 200 మంది రోగులు హాజరు కాగా ఇద్దరుకి క్యాన్సర్ రోగులు ఉన్నట్టు గుర్తించారు. కార్యక్రమంలో చొక్కాపు లక్ష్మణరావు, యువసేన ప్రతినిధులు చొక్కాపు రామ్‌సందీప్, చొక్కాపు రామ్‌చరణ్‌తేజ్ పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడి సభ్యత్వం రద్దు

రాజాం రూరల్: రాజాం ప్రాంతంలో సీపీఎం, సీఐటీయూలో 15 ఏళ్లుగా కీలకంగా వ్యవహరిస్తున్న సీహెచ్ రామ్మూర్తినాయుడికి సీపీఎంతో ఎటువంటి సంబంధంలేదని, ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రకటించారు. ఆదివారం రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ సీపీఎం, సీఐటీయూ పద్ధతులకు భిన్నంగా వ్యవహరించడంతో రామ్మూర్తినాయుడిని తప్పించినట్లు తెలిపారు.

నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ

మెంటాడ: ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సోమవారం నుంచి ఈనెల పదో తేదీ వరకూ ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

●**రాజాం:** రాజాంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సోమవారం నుంచి రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

నాయుడు కుటుంబానికి పరామర్శ

రాజాం: పెనుబాకలో ఎంపీయూపీ పాఠశాలలో ఇంగ్లీష్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆర్‌వీజే నాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ పరామర్శించారు. నాయుడు తల్లి రుంకు నారాయణమ్మ ఇటీవల మృతిచెందడంతో రాజాంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మధన్‌మోహన్, శాసపు వేణునాయుడు, శెట్టి శివరామకృష్ణ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

బొబ్బిలి రూరల్: కోమటిపల్లిలో ఆదివారం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అన్నపూర్ణ ఆపన్న హస్తం నిర్వాహకులు బొంతలకోటి లక్ష్మీ శంకరరావు ఆధ్వర్యంలో దుస్తులు, నిత్యవసరాల సరుకులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నామని తెలిపారు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే కోళ్ల



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు ప్రజాదర్బార్

శృంగవరపుకోట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నేడు నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

శృంగవరపుకోట: మండల కేంద్రమైన ఎస్.కోట శాఖ గ్రంథాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టంపై జిల్లా సమన్వయ సభ్యుడు సూర్యారావు పాఠకులకు అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ శ్రీధర్ ఉన్నారు.


14 మంది కోడిపందాల రాయళ్ల అరెస్టు

బాడంగి: కోడిపందాలు ఆడుతున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మండలంలోని కోడూరు గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్న 14 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి నుంచి రూ.9వేల 200ల నగదు, 6 కోళ్లు, 11 సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్ సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

ముగ్గురు పేకాటరాయళ్ల అరెస్టు

దత్తిరాజేరు: మండలంలోని లింగరాజపురం శివారులో మామిడితోటలో పేకాట శిబిరంపై దాడిచేసి ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

నేడు హజరత్ ఖాదర్‌బాబా జయంతి



ఖాదర్‌బాబా

విజయనగరం (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం బాబామెట్ట ఖాదర్ బాబా దర్గాలో హజరత్ ఖాదర్‌బాబా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించినట్టు దర్గా ధర్మకర్త ఖలీల్‌బాబు ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే జయంతి వేడుకల సందర్భంగా దర్గాలో ఖురాన్ పఠనం ప్రార్థన జరుగుతాయన్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, ఫకీరు మేళాలతో దర్బారు నుంచి ప్రత్యేక చాదర్, సుగంధం, పూలు, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా వెళ్లి ఖాదర్‌బాబాకు వాటిని సమర్పించి విశ్వశాంతి కోసం ప్రార్థనలు చేస్తామన్నారు. ఖాదర్‌బాబా భక్తులు, ప్రేమికులు ఈ వేడుకల్లో పాల్గొని బాబా ఆశీర్వచనం పొందాలని కోరారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



తెర్లాం: చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో భాగంగా చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో పిల్లలకు నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు చదివించడం, పద్యాలు, గద్యాలు పాడించడం, ఆటలు పోటీలు, క్విజ్ పోటీలు, వ్యాస రచనలు, పురాణాలు, ఇతిహాస కథలు, గ్రంథాలయంలో చదివించామన్నారు. రిటైర్డు ఎంఈవో సత్యనారాయణ హైస్కూల్ టీచర్ విస్సు, అంగన్‌వాడీ టీచర్ వై.శ్రీదేవి ఉన్నారు.

వివాదాస్పద భూములపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ శ్రీను, తదితరులు

బొబ్బిలి రూరల్: డొంగురువలస పంచాయతీలోని సర్వే నెంబరు 75లోని 130 ఎకరాల వివాదాస్పద భూములపై తహసీల్దార్ ఎం.శ్రీను ఆదివారం విచారణ చేపట్టారు. 40 ఏళ్ల కిందట డొంగురువలస, పారాది, కాశిందొరవలస, తదితర గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ఈ భూముల్లో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. పారాది ఎస్సీలు ఈ భూములను అమ్మేశారు. ఈ భూములను కొనుగోలు చేసిన వారు తమపై దౌర్జన్యాలు చేస్తున్నారని కాశిందొరవలస, డొంగురువలసకు చెందిన రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ విచారణ చేపట్టారు. భూ పట్టాలను పరిశీలించారు. తరాలుగా ఈ భూమి మీదే బతుకుతున్నామని, తమకు న్యాయం చేయాలని రైతులు మొరపెట్టుకున్నారు. రికార్డుల పరిశీలన అనంతరం రెండు వారాల్లో సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ విచారణలో ఆర్ఐ కల్యాణచక్రవర్తి, సర్వేయర్ సతీష్, సంతు తదితరులు ఉన్నారు.





కొనలేం.. తినలేం

- దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు
- రూ.100కి చేరిన టమాట.. ఘాటెక్కిన ఉల్లి
- వణికిస్తున్న వంటనూనెలు
- అల్లాడిపోతున్న జనం

ఇక నోరారా తినాలనుకుంటే కష్టమే.. జేబునిండా డబ్బున్నా అన్నీ కొనలేని పరిస్థితి. కూరగాయలు, వంటనూనెలు, నిత్యవసరాలు ఇలా ప్రతీదీ ధర పెరగడంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. వంటింట్లో కనీస అవసరమైన ఉల్లి, టమాటా ధర సైతం అమాంతం పెరగడంతో పేదలనోట ముద్ద దిగడం లేదు.

రాజాం రూరల్/ లక్కవరపుకోట

కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి.. ఈరోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు. ప్రధానంగా ఉల్లి, టమాటా ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. రూ.500 నోటు పట్టుకుని మార్కెట్‌కి వెళ్తే కనీసం అయిదు కిలోల కూరగాయలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు పలు రాష్ట్రాల నుంచి దిగుమతి కావాల్సిన టమాటా, ఉల్లి దిగుమతులు తగ్గడంతో అమాంతం ధరలు పెరిగాయి. ఫలితంగా పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం పడుతోంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై కూరగాయల ధరలు సైతం పెరగడంతో వారి పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. శివమాలలు, అయ్యప్ప, భవానీ దీక్షలు ప్రారంభం కావడంతో నాన్‌వెజ్ ధరలు తగ్గుముఖం పట్టాయి. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడం కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా చెప్పవచ్చు.

● కిలో టమాటా రూ.100..

ఆదివారం ఉదయం దాదాపుగా జిల్లా అంతటా కిలో టమాటా ధర రూ.100 పలికింది. గత వారం వీటి ధర రూ.60 పలికింది. కిలో ఉల్లిధర చిన్నవి రూ.60 కాగా కాస్త పెద్దవి రూ.70కి అమ్ముడైంది. గతవారం వీటి ధరలు రూ. 30 నుంచి రూ.40 వద్ద స్థిరంగా ఉన్నాయి. బల్లచిక్కుడు కాయలు కిలో రూ.130 కాగా, పొడవు చిక్కుళ్ల కిలో రూ.80 పలికింది. బీరకాయలు కిలో రూ.80 కాగా, బెండ, దొండ కాయలు కిలో రూ.60 నుంచి రూ.70 వద్ద స్థిరంగా ఉన్నాయి. రెండు అరటికాయలు రూ.30 కాగా నాటు అంగాకరకాయలు కిలో రూ.200 కాగా, హైబ్రిడ్ ధర కిలో రూ.150కి చేరింది. తాజాగా మార్కెట్లోకి వచ్చిన క్యాబేజీ చిన్నపువ్వు రూ.40 కాగా కాస్త పెద్దది రూ.50 అమ్ముడైంది. క్యాబేజీ బుట్ట కిలో రూ.70 కాగా, వంకాయలు కిలో రూ.60కి అమ్ముడయ్యా యి. కిలో బరువుండే ఆనపకాయ ధర రూ.80 కాగా చిన్న గుమ్మడికాయ ముక్క రూ.30 పలుకుతోంది. పచ్చిమిర్చి, అల్లం ధరలు కూడా సామాన్యుడ్ని అల్లాడిస్తున్నాయి. వారం రోజుల తేడాలోనే ధరలు అమాంతం పెరడగంతో కొనుగోలుదారులు సతమతమవుతున్నారు. కూరగాయలు కొనేందుకు కొంతమంది వెనుకంజ వేస్తుండగా కిలో ట మాటా కొనేందుకు మార్కెట్‌కు వెళ్లినవారు అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. ఇకపై పండగల కాలం కావడంతో వీటి ధరలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి, టమాటా దిగుమతి తగ్గిందని, ఇటీవల సంభవించిన తుపాన్‌ల ఫలితంగా కూరగాయల సాగు భారీగా దెబ్బతినడంతో ధరలు భారీ గా పెరిగాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. ఏదిఏమైనా సంక్రాంతి పర్వదినం వరకూ ధరలు పైపైకి ఎగబాకే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఆయిల్ రేటు అమాంతం పెరిగిపోయింది. పామాయిల్ కిలో రూ.90 నుంచి 140కి పెరిగింది. రిఫండ్ ఆయిల్ లీటర్ రూ.110 నుంచి 135కు పెరిగింది. దీంతో పేదల జీవితాలు మరింత కష్టంగా మారాయి.

● కిలో రూ.50 కొన్నాం..

గత వారం కిలో టమాటా రూ.50కి, ఉల్లిపాయలు రూ.35కి కొన్నాం. ఈ ఆదివారం టమాటా రూ.100కి చేరింది. ఉల్లిపాయలు చిన్నవి రూ.60 చెబుతున్నారు. వారం రోజులో డబుల్ అయితే ఎలా.. కారణాలు ఏమైనా సరే.. పేదవాళ్లు కూరగాయలు కొనలేని పరిస్థితి.

-లక్ష్మి, గృహిణి, రాజాం



రిజర్వాయర్ స్థలంలో చేపడుతున్న గోడ నిర్మాణం



రిజర్వాయర్ స్థలంలో గేట్లు ఏర్పాటు

'తాటిపూడి' భూముల్లో నిర్మాణాలు

- కోట్లు విలువ చేసే స్థలాలు కబ్జా
- ఇరిగేషన్ కార్యాలయం పక్కనే ఆక్రమణలు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని తాటిపూడి జలాశయానికి చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు చూస్తూ ఊరుకోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ముషిడిపల్లి పంచాయతీలోని తాటిపూడి రిజర్వాయర్ స్థలంలో గత వైసీపీ ప్రభుత్వంలో కోట్లు విలువచేసే ఈ భూములపై చిన్న..పెద్ద అనే తేడా లేకుండా పలువురు ఆక్రమణలు చేయడం మొదలుపెట్టారు. కొందరు ఇళ్లు కట్టేస్తుండగా.. మరికొందరు తమ భూములకు ప్రహరీలు, గేట్లు, ఇంకొందరు పంటలు వేసి సాగుచేస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా వీటిని అరికట్టాల్సిన సంబంధిత శాఖ కళ్లు మూసుకుని తిరుగుతుందా అనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ శాఖ కార్యాలయాన్ని ఆనుకునే ఆక్రమణలు చోటుచేసుకుంటున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. గత ప్రభుత్వంలోని పెద్దల పేర్లు చెప్పుకుని కోట్లు విలువజేసే ఈ భూముల్లో ఆక్రమణల పర్వం మొదలైంది. వైసీపీ అండతో చెలరేగిపోయిన వారిని ఈ కూటమి ప్రభుత్వం నియంత్రిస్తుందని ఆశించినప్పటికీ ఈ నిర్మాణాలు, ఆక్రమణలు ఆగకపోవడం విశేషం. అంతేకాక తాటిపూడి జలాశయానికి చెందిన క్వార్టర్లు, భూమి, కరెంటు వంటివి ఆక్రమణదారులకు పంట పండిస్తున్నాయి. వీటిని ఉన్నతాధికారులైనా కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఈ ఆక్రమణల విషయంపై జేఈ తమ్మినాయుడును వివరణ కోరగా వీటిపై విచారణ చేస్తామని తెలిపారు.

బాలికపై అత్యాచారం

- వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

భామిని: మనవరాలి వయసున్న బాలికపై ఓ వృద్ధుడు అఘాయిత్యానికి పా ల్పడ్డాడు. సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించాడు. అభం శుభం తెలి యని తొమ్మిదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేశాడు. ఈ ఘటన ఆదివారం భామిని మండలంలో చోటుచేసుకుంది. బత్తిలి ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్ర కారం.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు వలసబాట పట్టా రు. దీంతో నాన్నమ్మ వద్దే ఉంటూ నాలుగో తరగతి చదువుతుంది. శనివారం మ ధ్యాహ్నం మెడలో తాడు తయారుచేయడానికి వారిద్దరూ కలిసి కె.చిన్నారావు(69) అనే వృద్ధుడి ఇంటికి వెళ్లారు. బాలికను అక్కడే ఉంచి.. నాన్నమ్మ వేరే పనిమీద బ యటకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన చిన్నారావు బాలికపై అత్యాచారం చేశా డు. ఏడుచుకుంటూ ఇంటికి వెళ్లిన బాలిక జరిగిన విషయాన్ని నాన్నమ్మకు చె ప్పింది. వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అనిల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను వైద్య పరీక్షలకు తరలించారు. చిన్నారావును అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు.

డిప్యూటీ సీఎంని కదిలించిన వీడియో

- శాసనపల్లి గ్రామ సమస్యను 'ఎక్స్'లో పోస్టు చేసిన యువకుడు
- పరిష్కారానికి హామీ ఇచ్చిన పవన్‌కల్యాణ్



పిల్లలను ఎత్తుకొని నీటిలో నడుచుకుంటూ పాఠశాలకు తీసుకెళ్తున్న దృశ్యం(ఫైల్)



'ఎక్స్'లో పవన్‌కల్యాణ్ స్పందన

జామి: ఓ యువకుడు తమ గ్రామ సమస్యను వీడియో తీశాడు. దీన్ని ఆయన స్నేహితుడు తన ఎక్స్(ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేసి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ట్యాగ్ చేశాడు. ఈ వీడియో పవన్‌ను కదిలించింది. వెంటనే ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. దీంతో ఆ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేయడంతో ఆ యువకులను అభినందిస్తున్నారు. గజపతినగరం నియోజకవర్గం జామి మండలంలో శాసనపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామస్థులకు రెండు కిలోమీటర్ల దూరంలోని గంట్యాడ మండలం పెదవేమలితో ఎక్కువగా సంబంధాలు ఉన్నాయి. ప్రతి చిన్న అవసరానికి పెదవేమలి వెళ్తుంటారు. చదువులు, నిత్యావసరాలు, వైద్యం ఇలా అన్నింటికి ఆ గ్రామం వెళ్లాల్సిందే. అయితే, భారీ వర్షాలు కురిసే సమయంలో శాసనపల్లికి ఆనుకొని ఉన్న గెడ్డ పొంగిపొర్లుతుంది. ఈ సమయంలో బాహ్య ప్రపంచంతో గ్రామస్థులకు సంబంధాలు తెగిపోతాయి. ముఖ్యంగా ఈ గ్రామం నుంచి పెదవేమలి వెళ్లే దారిలో 200మీటర్ల మేర పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుంటుంది. ఈ సమయంలో గ్రామం నుంచి ఎవరూ బయటకు రాలేరు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సెలవు పెట్టాల్సిందే. అదే విధంగా భీమసింగి వైపు రావాలన్న గెడ్డ నీరు ఉంటుంది. దశాబ్దాలుగా వేధిస్తున్న ఈ సమస్యను పరిష్కరించాలని, గెడ్డకు రెండు వైపులా చిన్నపాటి వంతెనలు నిర్మించాలని ఎందరో నాయకులు, అధికారులకు గ్రామస్థులు విన్నవించినా ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బసవ కిశోర్ అనే యువకుడు గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను వీడియో తీశాడు. దీన్ని అతని స్నేహితుడు ఆకిరి జశ్వంత్ శనివారం రాత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ట్యాగ్ చేశాడు. పోస్ట్ చేసిన గంట వ్యవధిలో పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదిక ద్వారా స్పందించారు. 'మీ సమస్య నన్ను కదిలించింది. దీన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తాను. కొంచెం సమయం ఇవ్వండి. మీ గ్రామ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా'మని పోస్టు చేశారు. సమస్య పరిష్కారానికి సాక్షాత్తు డిప్యూటీ సీఎం నుంచే హామీ రావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీడియోను పోస్టు చేసిన యువకులను అభినందించారు.

చెరువులో పడి యువకుడి మృతి

వంగర: అరసాడ గ్రామానికి చెందిన సుకాది శంకర్(29) అనే యువకుడు శనివారం రాత్రి చెరువులో పడి మృతి చెందాడు. శంకర్ బహిర్భూమి కోసం గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి గౌరమ్మతో పాటు గ్రామస్థులు చుట్టుపక్కలా వెతికారు. అయినా ఆచూకీ లభ్యంకాలేదు. ఆదివారం ఉదయం చెరువులో శంకర్ మృతదేహం తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ షేక్ శంకర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి రాజాం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ ఒకరి...

దత్తిరాజేరు: విశాఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఒకరి ఆదివారం మృతి చెందారు. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ కథనం మేరకు.. మండలంలోని చౌ దంతివలస గ్రామానికి చెందిన ఈదుబిల్లి భాస్కరరావు (48) మద్యానికి బానిస య్యాడు. ఈనేపథ్యంలో ఆరోగ్యం క్షీణించడంతోపాటు కడుపులో నొప్పి తాళలేక శని వారం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. భాస్కరరావు తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

16.5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం

బొండపల్లి: మండలంలోని గరుడబిల్లి జంక్షన్ సమీపంలో వీరాగౌరీశంకర్ స్టోన్ క్రషర్‌లో అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ బియ్యాన్ని బొండపల్లి ఇన్‌చార్జి ఎస్ ఐ కె.లక్ష్మణరావు దాడిచేసి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గజపతినగరం మం డలంలోని బూడిపేట గ్రామానికి చెందిన పొట్నూరు అప్పలనాయుడు 330 బ స్తాలు(16.5 టన్నుల) పౌరసరఫరాల శాఖ పంపిణీ చేసిన బియ్యాన్ని నిల్వచేశాడ న్న సమాచారంతో దాడిచేసి పట్టుకున్నట్లు లక్ష్మణరావు తెలిపారు. ఈ బియ్యాన్ని సీఎస్‌డీటీ తిరుపతిరావుకు స్వాధీనపరచి నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

కూమార్తె కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు

సంతకవిటి: తన కుమార్తె కనిపించడం లేదని మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమార్తె శనివారం ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధుమిత్రులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేదని ఫిర్యాదులో స్పష్టం చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్. గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రెండు ట్రాక్టర్లు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల వద్ద చంపావతినది నుంచి ఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను ఆదివారం ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. పాతకొప్పెర్లకు చెందిన కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో పోలీసులు ట్రాక్టర్లు సీజ్‌చేసి కేసులు నమోదుచేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ తెలిపారు.

చెట్టు కొమ్మలు నరికి పోల్ నిర్మాణం



ఆర్టీఏ కార్యాలయం దగ్గరలోని, దుకాణం ఎదురుగా ఉన్న చెట్టును నరికి వేస్తున్న దృశ్యాలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలో ఓ క్రాకర్స్ వ్యాపారి తన బిల్డింగ్‌కు అడ్డుగా ఉందని పలువురికి నీడనిచ్చే పచ్చటి చెట్టుకొమ్మలను నరికివేయించాడు. ప్రభుత్వం ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి పెంచిన చెట్టు కొమ్మలను తొలగించాడు. జాతీయ రహదారి 23కు అనుకుని ఉన్న ప్రభుత్వం స్థలంలో తన వ్యాపారానికి అనుగుణంగా ప్రకటనలు ఏర్పాటు చేసుకునేందుకు ఇటీవల పోల్స్ ఏర్పాటుచేసుకున్నాడు. ఇందేటని ప్రశ్నిస్తే.. తన పనివారితో దుర్భాషలాడుతూ, గొడవకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఎన్.హెచ్ అధిఇకారులు పట్టించుకోక పోవటంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యాపారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాజాంలో లక్ష బిల్వార్చన



రాజాం రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలు, నవదుర్గ మండలదీక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం దుర్గాదేవికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రధాన అర్చకులు రాజు సారధ్యంలో గురుభవానీలు బెహరా తౌడు, నంది సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చనలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు, సంఘసేవకులకు ప్రత్యేక గుర్తింపు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి, అక్టోబరు 6: ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలక మైనదని, సమాజంలో రుగ్మతలను పారదోలడానికి సామాజిక కార్యకర్తల బాధ్యత బృహత్తరమైనదని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అభిమాని ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలకు సేవాశ్రీ ఎక్స లెన్సీ అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఎంతో మంది ఉన్నతమైన స్థానాలను అధిరోహించగలుగుతున్నారన్నారు. ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ కేవీ అప్పారావు మాట్లాడుతూ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూనే అభిమాని సంస్థ విస్తృతమైన సేవలందించగలుగుతోందన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్, రోటరీక్లబ్ ప్రతినిధి, కారుణ్యఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు, రాజగోపాలనాయుడు మాట్లాడారు. ప్రభుత్వ పరంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన గవిరిశెట్టి వెంకటరావు, యజ్జల మహేశ్, అనపర్తి పద్మావతి, ఎస్వీ రమణమూర్తి (గ్రీన్‌బెల్ట్ సొసైటీ), మింది విజయమోహన్(కళాసంస్థలు), గుంట్రెడ్డి భాస్కరరావు(కార్టూనిస్టు), బంకురు ప్రసాద్ (తైక్వాండో కోచ్), లంక వాసుదేవరావు(నేను సైతం), ముంతల చిన్నారావు, చింతాడ శ్రీదేవిలను ఘనంగా సన్మానించి సేవా శ్రీ ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు. యోగా టీచర్ కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.